# ఆనందారామం విరిసిన మందారం...

(ప్రముఖ రచయిత్రి, విదుషీమణి డా. సి. ఆనందారామంగారు ఫిబ్రవరి 10వ తేదిన కీర్తిశేషులయ్యారు వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ వారితో నాకు ఉన్న కొన్ని జ్ఞాపకాలు..)

ఆచార్య జి. అరుణకుమారి,
తెలుగు శాఖాధ్యక్షులు,
హైదరాబాద్ విశ్వవిద్యాలయం.
చరవాణి: 9396503944.

నేను విద్యార్థినిగా 1979వ సంవత్సరం హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ప్రాంగణంలోకి అడుగు పెట్టగానే మొట్టమొదటిగా కనిపించిన స్త్రీమూర్తి డా. చిలకమర్రి ఆనందారామంగారు. 'చీకటి కడుపున కాంతి' నవల హిందీ అనువాద నవలగా రూపొందే క్రమంలో రచయిత్రిగా ఆమెతో నా పరిచయం పరోక్షమైనది. ఆ పరోక్ష రూపం కళ్ళ ఎదుట ప్రత్యక్షమైనప్పుడు నేను పొందిన ఆనందం అనిర్వచనీయం. గలగలా మాట్లాడుతూ, సాదరంగా ఆహ్వానించిన మాతృమూర్తి డా. చిలకమర్రి ఆనందారామం. నాకు ఎం.ఫిల్.లో "సమాజం – సాహిత్యం" అనే అంశాన్ని బోధించేవారు. మార్క్సిజంపైన ప్రత్యేకమైన అభిరుచిని కనబరచి, తరగతి గదులలో సెమినార్ లు నిర్వహించేవారు.

సృజనాత్మకత, విమర్శ, పాండిత్యం వంటి మూడు రంగాలలో తెలుగు సాహిత్య రచనలు చేసినవారిని వేళ్ళ మీద లెక్కపెట్టవచ్చు. అలాంటి వారి జాబితాలో డా. సి. ఆనందారామంగారు ఒకరు. ప్రాగ్రూప విమర్శ, తులనాత్మక విమర్శ, నవలా విమర్శకు సంబంధించి ఆనందారామంగారు చేసిన పరిశోధన గానీ, అధ్యయనం గానీ విమర్శ గానీ తొలి వరసలో నిలబడతాయి. ఏ విమర్శకుడికి తగ్గనంత గొప్ప విమర్శకురాలిగా రచనలు చేసారు.

పూల తోటలో నడుస్తుంటే ఆ పూల సువాసన గాలిలో కలిసి ఆ ప్రాంతమంతా పరిమళభరితం అవుతుంది. మన ఇంటి ప్రాంగణంలో ఒక మల్లె పొదో, సన్నజాజి తీగో ఉంటే ఆ వాసన మన ఇంటిని చుట్టుముట్టు ఉంటుంది. కానీ కొన్నిసార్లు మనం వాటిని గమనించలేం.ఆ సుగంధం వల్ల మనలో ఒక రకమైన మంచి భావన, మృదుత్వం వస్తాయి. అలాంటి వాతావరణాన్ని తెలుగు శాఖలో సృష్టించి, ఆ లక్షణాలను మా అందరికీ అలవాటు చేసిన ఆనందారామం గారు ఎప్పుడూ చెప్పుకోదగ్గ మంచి మనిషే.

రూపంలోనూ, గుణంలోనూ, బోధనలోనూ ఆమెకు ఆమె సాటి. హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో పరిశోధనకు ఒక కొత్త రకమైన ఒరవడిగా పాఠ్యంశాలను సమకూర్చిన ఘనత ఆచార్య కొత్తపల్లి వీరభద్రరరావు, ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం, డా. సి. ఆనందారామంగార్లకు దక్కుతుంది. అలాంటి గొప్ప కార్యనిర్వహణలో అనేకమంది విద్యార్థులకు పరిశోధనలో పర్యవేక్షణ బాధ్యతను వహిస్తూ, దిశానిర్దేశం చేస్తూ ఎన్నో కొత్త విషయాలను, ఆలోచనలను తమ బోధనల ద్వారా మాలో స్ఫూర్తిని కలిగించేవారు. నవలా రచయిత్రిగా సృజనాత్మక రచనలపై సాధికారతను సాధించినవారు డా. సి. ఆనందారామం.

డా. సి. ఆనందారామంగారి కలం నుండి అనేకమైన రచనలు వివిధ ప్రక్రియలలో వెలువడ్డాయి. ఆ రచనలు సమాజాన్ని చైతన్య పథం వైపుగా నడిపించే రీతిలో దోహదపడ్డాయి. ఆమె సుమారుగా 60 వరకు నవలలు, 100కి పైచిలుకు కథలు, కొన్ని విమర్శనా గ్రంథాలను రచించారు. ప్రధానంగా వీరు రాసిన “ఆత్మబలి” నవల “సంసార బంధం” సినిమాగా రూపొందింది. అదే నవల “జీవనతరంగాలు” అనే ధారావాహికగా చాలా కాలం ప్రజల ఆదరణ పొందింది. ఆనందారామం గారు రాసిన “జాగృతి” అనే నవల “త్రిశూలం” సినిమాగా, “మమతల కోవెల” నవల “జ్యోతి” సినిమాగా వచ్చాయి. ఇటు

సాహితీ రంగంలోనూ, అటు సినీ రచనా రంగంలోనూ తనదైన స్థానాన్ని, ముద్రను వేసుకున్నారు. ఆమె రాసిన రచనలకుగాను అనేకమైన పురస్కారాలు లభించాయి. 1972వ సంవత్సరం *"గృహలక్ష్మి స్వర్ణకంకణం"*, 1979వ సంవత్సరం "తుఫాన్" నవలకు గాను *"ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ అవార్డును"*, *"తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారాలు"* రెండుసార్లు పొందారు. ఇవే కాక *"మాదిరెడ్డి, గోపీచంద్, మాలతీ చందూర్"* తదితర ఎన్నో పురస్కారాలు ఆమెను వరించాయి. తెలుగు చలన చిత్రాలకు సెన్సార్ బోర్డ్ సభ్యురాలిగా అనేక సంవత్సరాలు వారి సేవలను అందించారు.

డా. సి. ఆనందారామంగారి రచనల్లో వారికున్న భిన్న దృక్పథాలను నిక్కచ్చిగా విమర్శించేవారు. వజ్రానికి బహు కోణాలు ఉన్నట్లుగానే ఆనందారామంగారు కూడా బహుముఖ ప్రజ్ఞాశాలి. ఒకవైపు సాహిత్య సృజన మరోవైపు వృత్తిజీవనంతో పాటు వ్యక్తిగత జీవనం అనే కోణాలు ఆమెలో దర్శనమిస్తాయి. సంప్రదాయ కుటుంబంలో వారు జన్మించినప్పటికీ సృజనాత్మక రచనల్లోని ఆలోచనా క్రమం మాత్రం అభ్యుదయ భావజాలంతో నిండినదే.

ఆచార్య సి. నారాయణ రెడ్డిగారి పర్యవేక్షణలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి *"తెలుగు నవలల్లో కుటుంబ జీవన చిత్రణ"* అనే అంశంపై పరిశోధన చేసి పిహెచ్.డి. పట్టాను పొందారు. నేడు ఆ పరిశోధనా గ్రంథం అనేకమంది పరిశోధకులకు పరిశోధనా రంగంలో కర దీపికగా నిలిచింది. నవలా రచయిత్రులు ఎన్ని నవలలు రాసినా తెలుగు సాహిత్య చరిత్ర పుటలలో ఒక్క నవల పేరు మాత్రమే రచయిత్రుల పేరు పక్కన స్థిర రూపం దాల్చి ప్రచురణకు నోచుకోవడం బాధాకరం. రచయిత్రి రచించిన నవలల్లో కనిపించే సామాజిక పరిణామం కానీ, ఆలోచనా విధానంలో కానీ కాలానుగత మార్పులు సామాజిక స్వరూపాన్ని నిర్దేసించేవిగానే ఉంటాయి. చరిత్ర నిర్మాణానికి సాహిత్యం, భాష, సంస్కృతి,

శాసనాలు, నాణేలు ఏ రీతిగా ఉపయోగపడతాయో ఆ రీతిగానే సామాజిక స్వరూప నిర్మాణానికి నవలలు కూడా దారి చూపుతాయి. నవలా రచన కూడా చరిత్ర నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషిస్తుంది.

డా. సి. ఆనందారామంగారి అసలు పేరు ఆనందలక్ష్మీ. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో గోపాలమ్మ, ముదుంబై రంగాచార్యులు పుణ్య దంపతులకు 1935వ సంవత్సరం ఆగస్టు 20వ తేదిన జన్మించారు. ఆమె ప్రాథమిక విద్యాభ్యాసం ఏలూరులోనే నడిచింది. ఏలూరులో ఉన్న సర్. సి.ఆర్.ఆర్ కళాశాలలోనే వారి వృత్తి ప్రస్థానం మొదలైంది. తర్వాత హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో తమ విధులు నిర్వహించారు. వీరి పర్యవేక్షణలో చాలా విలువైన పరిశోధన గ్రంథాలు వెలువడ్డాయి. జానపదం, వచన కవిత్వం, సాహిత్యంలో చరిత్ర, కథలు, నవలలు, నాటికలు తదితర ప్రక్రియలపై విశేషంగా పరిశోధనలు చేయించారు.

ఆనందారామంగారికి తెలుగు భాష అంటే అమితమైన ప్రేమాభిమానాలు గలవారు. ఒక వైపు గృహిణిగా ఇంటి బాధ్యతలు నిర్వహిస్తూ, మరో వైపు విశ్వవిద్యాలయంలో పాఠాలు బోధిస్తూ, ఇంకో వైపు సృజనాత్మక రచనలు చేస్తూ, అనుకున్న సమయానికి రాసిన రచనలను ముద్రిస్తూ ఒక్క నిమిషం కాలం వృథా కాకుండా జీవించిన ఆవిడ ఇలా వెళ్ళిపోవడం ఆమెను ఇష్టపడే వారికి కష్టమే. ఆమె జీవిత ప్రయాణంలో వారి సహచరుడు చిలకమర్రి రామాచార్యులగారి సహకారం గొప్పది. ఆమె తన భర్త పేరును కలుపుకొని ఆనందరామంగా ప్రసిద్ధి చెందారు. ఒక స్త్రీమూర్తి ఎదుగుదలలో తన విజయానికి వెనుక ఒక పురుషుడు ఉంటాడు అనడానికి నిదర్శనంగా రామాచార్యులవారు నిలుస్తారు.

మనసులో ఆలోచన పుట్టిన వెంటనే దానికి అక్షర రూపం ఇవ్వాలని సంకల్పించుకొని రచనలు చేసేవారు. ఆమెకి చిన్నతనం నుండి తార్కిక దృష్టి ఉండడంతో ఆమె రాసిన

రచనలలో కూడా వారు ఆ లక్షణాన్నే ప్రతిఫలింపజేసేవారు. ఈ మధ్యనే తన స్వీయచరిత్ర రాసుకుంటే వైరి సమాసం అనే పేరుతో రాసుకుంటానని ఒక ఇంటర్వ్యూలో ఆనందారామంగారు చెప్పారు. కానీ రాయకుండానే వెళ్ళిపోయారు. ఆనందారామంగారితో శిష్య, సహఅధ్యాపక సంబంధాన్ని ఒకసారి స్మరించుకుంటూ డా. సి. ఆనందారామం గారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను.